
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 63.162 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో శనివారానికి 63.162 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1117 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,550
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,890
3 శాతం జీఎస్టీతో	రూ.8,127
నవర (8 గ్రా)	రూ.65,016

గరిష్టం/కనిష్టం
35.0 /23.0

వాతావరణం
ఆదివారం జిల్లాలో వాతావరణం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు హరియాణా గవర్నర్ రాక
వెంకటాచలం: హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆదివారం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు రానున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో జరగనున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మనుమడు విష్ణు వివాహ రిసెప్షన్‌కు హాజరవుతున్నారని ట్రస్ట్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.45 గంటలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఈ రిసెప్షన్ వేడుకలకు హాజరుకానున్నారు.

స్థానిక సంస్థల్లో పోటీకి సంతానం అడ్డుకాదు
- ఆ నిబంధన సడలిస్తూ గెజిట్ జారీ చేసిన న్యాయశాఖ

సీతారామపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల పోటీకి సంబంధించి ఉన్న 'సంతానం' నిబంధనలను పంచాయతీరాజ్ చట్టం నుంచి తొలగిస్తూ న్యాయశాఖ ఈ నెల 12న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అనే నిబంధన ఇప్పటి వరకు పంచాయతీరాజ్ చట్టంలో ఉంది. 30 ఏళ్ల కిందట దేశ జనాభా రికార్డు స్థాయిలో పెరిగిన నేపథ్యంలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. కుటుంబ నియంత్రణకు శ్రీకారం చుట్టాయి. ప్రత్యేక చట్టాలు తెచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారిని అనర్హులుగా ప్రకటించారు. అప్పట్లో ఈ నిబంధన కలకలం రేపి ఎంతో మంది రాజకీయ ఆశావహులపై నీళ్లు చల్లింది. తాజా నిర్ణయంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


ఎండలోనే నిలువ కాళ్లపై ఎన్‌సీసీ విద్యార్థులు



ఎన్‌సీసీ విద్యార్థులతో ఎండలో సెల్యూట్ చేయించే కార్యక్రమం

కందుకూరు రూరల్: కందుకూరులోని దూబగుంట వద్ద పారిశుధ్య కార్యక్రమాన్ని, ఇంకుడు గుంతను సీఎం చంద్రబాబు పరిశీలించే సమయంలో సెల్యూట్ కొట్టేందుకు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులను ఎండలో నిలువు కాళ్లపై రోడ్డుపై నిలబెట్టారు. సీఎం వచ్చే గంట ముందు నుంచే వారితో ఎండలో మాక్ డ్రిల్ చేయించారు. ఎండ తీవ్రత ఉన్న సమయంలో ఆకలి దప్పులతో ఎన్‌సీసీ విద్యార్థులను ఇలా ఇబ్బంది పెట్టడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. తిరిగి సీఎం వెళ్లిపోయిన తర్వాత కనిగిరి రోడ్డులో చెట్ల కింద వారికి మధ్యాహ్నం 2.50 గంటలకు భోజనం పెట్టారు.

క్లస్టర్ సమావేశాలు ఎంతో ఉపయోగం



మాట్లాడుతున్న ఏపీడీ రవీంద్రనాథ్‌రెడ్డి

వరికుంటపాడు: ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి క్లస్టర్ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఫస్ట్ క్లస్టర్ సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల 3వ శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు హాజరైతే బోధనా నైపుణ్యాలు, పద్ధతులపై చర్చించుకోవచ్చన్నారు. క్లస్టర్ సమావేశాలు జ్ఞాన భాండాగారాలుగా తయారు అవుతాయని, విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య నందించవచ్చన్నారు. సమావేశాల్లో మాదిరి పాఠ్యాంశ బోధనకు ప్రతి ఉపాధ్యాయుడు సిద్ధం కావాలన్నారు. బోధనకు ముందు ఉపాధ్యాయులు సంసిద్ధత కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో ఎంఈఓ–1, 2 షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన సీఎం పర్యటన
నెల్లూరు(క్రైమ్): సీఎం చంద్రబాబు కందుకూరు పర్యటన శనివారం భారీ బందోబస్తు నడుమ ముగిసింది. ఈ నేపథ్యంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ 1,060 మందితో భారీ భద్రత ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసులను మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. పర్యటన ఆద్యంతం ప్రశాంతంగా ముగియడంతో పటిష్టంగా బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల సిబ్బందికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ క్రీడా సమాఖ్యలు
బోగస్ క్రీడలు..



జిల్లాలో బోగస్ క్రీడల మాఫియా చెలరేగిపోతోంది. ప్రభుత్వ క్రీడా శాఖలో భాగమైన క్రీడా ప్రాధికార సంస్థకు సమాంతరంగా నకిలీ క్రీడా అసోసియేషన్లు, క్రీడా నిర్వాహక సంస్థలు పుట్టుకొచ్చాయి. ప్రభుత్వ గుర్తింపు లేని స్వయం ప్రకటిత సంస్థలు జిల్లా, రాష్ట్ర, అంతర్రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు, విజేతలను ఎంపిక చేసినట్లు సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నాయి. విద్యార్థులకు క్రీడల్లో ప్రావీణ్యం లేకపోయినా.. పేమెంట్ ఇస్తే చాలు అంటూ ఒక్కో ఈవెంట్, టోర్నమెంట్ పేరుతో రూ.లక్షల్లో దండుకుంటున్నాయి.

- క్రీడాప్రాధికార సంస్థకు సమాంతర వ్యవస్థ
- ప్రావీణ్యం వద్దు.. పేమెంటే ముద్దు
- ఇండోర్‌గేమ్స్‌లో ప్రతిభ లేకున్నా అంతర్జాతీయ స్థాయి విజేతగా సర్టిఫికెట్లు
- నకిలీ క్రీడా నిర్వాహక సంస్థలతో ప్రైవేట్ స్కూళ్లు మిలాఖత్
- ఒక్కో టోర్నమెంట్‌కు రూ.లక్షల్లో వసూళ్లు



నెల్లూరు (స్పోర్ట్స్‌పేట): జిల్లాలో యోగా, కరాటే, తైక్వాండో, చెస్, క్యారమ్స్, కర్రసాము వంటి ఇండోర్ క్రీడలకు సంబంధించి నకిలీ క్రీడా అసోసియేషన్లు, క్రీడా నిర్వాహక సంస్థలు ఒక మాఫియాగా తయారై క్రీడలను వ్యాపారంగా మలుచుకుంటున్నాయి. రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలకు సమాంతర స్థాయిలో నకిలీ అసోసియేషన్లు, నిర్వహణ సంస్థలుగా అవతరించాయి. విద్యార్థులకు ఆయా క్రీడలపై కనీస అవగాహన లేకపోయినప్పటికీ వీరు జిల్లా, రాష్ట్ర, అంతర్రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా ప్రకటించి ప్రశంసా వేదికలపై సర్టిఫికెట్లు అందజేస్తున్నాయి. క్రీడ, ఈవెంట్ స్థాయిని బట్టి అమౌంట్ ఫిక్స్ చేస్తున్నారు.

ప్రైవేట్ స్కూళ్లకు ప్రచారం.. విద్యార్థుల భవిష్యత్ అంధకారం

జిల్లాలో దాదాపు అన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు క్రీడా మైదానాలు లేవు. దీన్ని అవకాశంగా తీసుకుని ఈ మాఫియా విద్యార్థులకు క్రీడల్లో ప్రావీణ్యం లేకపోయినా ఇండోర్ గేమ్స్‌లో విజేతలుగా ప్రకటించుకుంటూ డబ్బులు దండుకుంటుంటే.. ప్రైవేట్ యజమాన్యాలు గొప్పలు ప్రచారం చేసుకుంటున్నాయి. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ ఇస్తున్నట్లు యజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ప్రత్యేకంగా ఫీజులు వసూలు చేస్తుంటే.. ప్రతి ఈవెంట్ పేరుతో అదనంగా మరికొంత వసూలు చేస్తున్నారు. మరో రకంగా మీ పిల్లలకు క్రీడల్లో సర్టిఫికెట్లను, మెడల్స్‌ను ఇప్పిస్తామని వేల రూపాయలు దండుకుంటున్నారు. ఈ ఇండోర్ గేమ్స్‌కు సంబంధించి ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రులు ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని అవగాహన రాహిత్యంతో పిల్లలను పంపిస్తున్నారు. ఒక స్కూల్ నుంచి 40 నుంచి 50 మందిని సంవత్సరానికి మూడు టోర్నమెంట్లకు తీసుకెళ్తున్నారు. నేర్పించే మెంటర్‌కు ఎటువంటి అధికార పూర్వక గుర్తింపు ఉండదు. ఈ పోటీలు నిర్వహించే వారికి సంబంధిత అసోసియేషన్లు, ప్రభుత్వ గుర్తింపులు ఉండవు.

విదేశాల్లోనూ క్రీడలు

నకిలీ క్రీడా సమాఖ్యలు, అసోసియేషన్లు జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో పోటీలను కూడా నిర్వహిస్తారు. ఇక్కడి వ్యక్తులే అంతర్జాతీయ స్థాయి పోటీలంటూ సింగపూర్, శ్రీలంక, మలేసియా, లక్ష దీవులు వంటి దేశాల్లో టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియంలతో కూడా పనిలేకుండా ఒక హైప్రొఫైల్‌తో ఈ అంతర్జాతీయ పోటీలను నిర్వహిస్తున్నారు. ఆ సర్టిఫికెట్లను తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు అంటూ ప్రభుత్వం ఇచ్చే ప్రశంసా పత్రాలకు అర్హులుగా ప్రకటించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు పంపిస్తున్నారు.

కొత్తకొత్త క్రీడా సమాఖ్యలు

నకిలీ క్రీడా సమాఖ్యలు, అసోసియేషన్ల మధ్య నగదు లావాదేవీల్లో గొడవలు రావడంతో ఎవరికి వారు ప్రత్యేకంగా కొత్త సమాఖ్యలను ఏర్పాటు చేసుకుంటున్నారు. క్రీడ ఏదైనా ఆ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. అందుకు సంబంధించి మెంటర్లు, కోచ్‌లు, వారు నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకే గుర్తింపు లభిస్తుందన్న విషయం తల్లిదండ్రులు తెలుసుకోవాలని గుర్తింపు పొందిన క్రీడా అసోసియేషన్లు చెబుతున్నాయి.

ఒక్కో గేమ్‌కు.. ఒక్కో ఇన్‌స్ట్రక్టర్
ఒక్కొక్క స్కూల్ ఒక్కో ఇండోర్ గేమ్‌ను ఎంపిక చేసుకుని పిల్లలకు అవి నేర్పిస్తున్నట్లు ఒక పిరియడ్‌ను కేటాయిస్తున్నట్లు నమ్మ బలుకుతారు. ఇందు కోసం ఇండోర్ గేమ్స్ నేర్పించేందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేస్తారు. సంవత్సరంలో వాళ్లు వేసుకున్న షెడ్యూలు ప్రకారం టోర్నమెంట్లకు పిల్లలను తీసుకెళ్తారు. ఏ మాత్రం అధీకృత లేని సంస్థలు, కొంత మంది వ్యక్తులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న క్రీడా సమాఖ్యలు ఈ టోర్నమెంట్లను నిర్వహిస్తుంటాయి. ఇందుకు సంబంధించి స్కూళ్లల్లో ఆ టోర్నమెంట్లకు వెళ్లేందుకు పిల్లల దగ్గర నుంచి క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులు, భోజనాలు, వసతి అంటూ ఒక్కో పిల్లాడి నుంచి వేలల్లో దండుకుంటారు. ఆ టోర్నమెంట్‌కు వెళ్లిన ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు మెమెంటోలు, సన్మానాలు ఏర్పాటు చేసి పిల్లలను ఫొటోలు తీసుకుని నకిలీ క్రీడల సమాఖ్యలు ప్రచారం చేసుకుంటుంటే.. తమ విద్యార్థులు పలానా క్రీడల్లో టాలెంట్ చూపించారని స్కూళ్ల యాజమాన్యాలు పబ్లిసిటీ కోసం ఉపయోగించుకుంటాయి. తల్లిదండ్రులను మోసం చేస్తూ విద్యా సంస్థలు చేసే నిర్వాకం పిల్లలకు ఎటువంటి క్రీడా స్ఫూర్తిని ఇవ్వకపోవడంతోపాటు ఏడాది పొడవునా డబ్బులు దండుకోవడానికి ఈ పోటీలు ఉపయోగపడుతున్నాయి.

అవగాహన పెంచుకోవాలి
ప్రైవేట్ స్కూళ్లల్లో నిర్వహిస్తున్న పోటీల్లో ఏవి అధికారిక పూర్వకమైనవో తల్లిదండ్రులు తెలుసుకోవాలి. ఒక టోర్నమెంట్‌లో ఒక స్కూల్ నుంచి 30 మంది, 40 మంది పిల్లలకు ఒకేసారి మెడల్స్, ప్రైజ్‌లు ఎలా వస్తాయి? అనే విషయంపై దృష్టి సారిస్తే వాస్తవం తెలుసుకోవచ్చు. ఆయా క్రీడలకు సంబంధించిన వారిని సంప్రదించినా తెలుసుకోవచ్చు. బూటకపు టోర్నమెంట్లు ఈ మధ్య ఎక్కువయ్యాయి.
– ఎస్‌కే ఖయ్యూం, యోగా అసోసియేషన్ ట్రెజరర్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు

రూ.వేలు దండుకుంటున్నారు
ట్రాక్ సూట్లు, బనియన్లు, బూట్లు అంటూ 2, 3వ తరగతి చదివే పిల్లల దగ్గర నుంచి కూడా వేలాది రూపాయలు దండుకుంటున్నారు. స్కూల్ వాళ్లు చెప్పారని ఆ క్రీడలకు పంపిస్తున్నాం. వాస్తవానికి ఆ వయసు పిల్లలకు వారు సేకరించే అమౌంట్‌కు సంబంధం లేదు. క్రీడల పేరుతో జరుగుతున్న అన్యాయాన్ని తల్లిదండ్రులందరూ తెలుసుకోవాలి.
– భువనేశ్వరి, గృహిణి

అంతా డబ్బు మయం
పిల్లల టాలెంట్‌తో పనిలేదు. రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్తే వాళ్లు చెప్పిన అమౌంట్ ఇస్తే జాతీయ స్థాయి పోటీలకు ఆపై పోటీలకు ఎంపిక చేస్తారు. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే టీమ్ అంతటికి అయ్యే ఖర్చులో కొంత మీరు పెట్టుకోండి అని ఆఫర్లు కూడా ఇస్తారు. అలా చేసిన వారి పిల్లలకే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో స్థానం కల్పిస్తారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరపాలి.
– వెంకటేశ్వరరావు, పేరెంట్

అంబేడ్కర్ విగ్రహాన్ని విస్మరించిన సీఎం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాలు
- రీసైక్లింగ్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం



పూలమాలకు నోచుకోని అంబేడ్కర్ విగ్రహం

కందుకూరు రూరల్: పట్టణంలోని దూబగుంటలో మెటీరియల్ రీసైక్లింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించేందుకు శనివారం వచ్చిన సీఎం చంద్రబాబు అక్కడే ఉన్న భారత రాజ్యాంగ నిర్మాణ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విస్మరించి అగౌరవపరిచారు. బస్‌లో నుంచి కాన్వాయిలోకి మారే సమీపంలో ఆ విగ్రహం ఉన్నప్పటికీ కనీసం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాలని అనుకోకపోవడంపై సర్వత్రా దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అక్కడే దాదాపు అర్ధగంట సేపు సీఎంతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. ఆయన రాసిన రాజ్యాంగంతో పదవులు, అధికారాలు నిర్వహిస్తున్న వీరు ఆయన్ను విస్మరించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రీ సైక్లింగ్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం

దూబగుంట వద్ద ఏర్పాటు చేసిన మెటీరియల్ రీ సైక్లింగ్ ఫెసిలిటీ సెంటర్ (ఎంఆర్ఎఫ్‌సీ)ను సీఎం ప్రారంభించారు. కండి మినరల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.45 లక్షలతో దీన్ని ఏర్పాటు చేశారు. రోజుకు 24 టన్నుల పునర్వినియోగం లేని వ్యర్థాలను శుభ్రపరిచే యంత్రాన్ని సీఎం పరిశీలించారు. అక్కడి నుంచి దూబగుంటలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో దూబగుంటలోని పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. భీమని హరికృష్ణ ఇంటిలో నిర్మించిన ఇంకుడుగుంతను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, సీడీఎంఏ సంపత్‌కుమార్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, సబ్‌కలెక్టర్ టి.శ్రీపూజ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛదివస్‌ను ప్రారంభించిన ఆనం



ఆత్మకూరులో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న మంత్రి ఆనం, అధికారులు

ఆత్మకూరు: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని, మున్సిపల్ కమిషనర్ సి.గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆత్మకూరు పట్టణంలోని సత్రం సెంటర్ వద్ద శనివారం మంత్రి ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం మంత్రి ఆనం, అధికారులు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞను నిర్వహించారు. అక్కడి నుంచి తూర్పువీధిలో అలఘునాథస్వామి ఆలయం వరకు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అలఘునాథస్వామి ఆలయానికి సంబంధించి కల్యాణ మండపం అభివృద్ధికి రూ.53.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు ఆరోగ్య శాఖా మంత్రి సత్యప్రసాద్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ఆత్మకూరు–సోమశిల మార్గాన్ని అభివృద్ధి చేయడానికి సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ నిధులు మంజూరు చేస్తారన్నారు. బీసీ హాస్టళ్ల భవనాల పునఃనిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలో పలు విద్యుత్ లైన్ల మార్పు, ఆ శాఖ భవనాల నిర్మాణానికి రూ.85 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చెరువు ఎదురుగా మొక్కలు నాటారు. బైపాస్‌రోడ్డులోని ఏపీ బాలికల గురుకుల రెసిడెన్సియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, రవాణా శాఖ ఎంవీఐ ఎం రాములు, ఫారెస్ట్ రేంజర్ శేఖర్, డీఆర్ఓ పిచ్చిరెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధికి దక్కని హామీ
- తిరిగి ప్రకాశంలో కలిపే విషయం దాటవేత
- రామాయపట్నం పోర్టు, ఉత్తర బైపాస్, రాళ్లపాడు ప్రాజెక్ట్ అభివృద్ధి ఊసేలేదు
- నిరాశ పర్చిన బాబు పర్యటన



ముఖాముఖిలో సీఎంను ప్రశ్నిస్తున్న స్థానికులు

కందుకూరు: సీఎం చంద్రబాబు కందుకూరు పర్యటన నియోజకవర్గ ప్రజలను పూర్తిగా నిరాశ పరిచింది. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోభివృద్ధికి ఎటువంటి హామీలివ్వకుండానే వెళ్లిపోయారు. నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో ఎప్పుడు కలుపుతారంటూ ప్రశ్నించిన వారిపై ఎదురు దాడి చేయడం చర్చనీయాంశమైంది. శనివారం సీఎం చంద్రబాబు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్నారు.

స్పందించని సీఎం చంద్రబాబు

కందుకూరు నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యల పరిష్కారానికి సీఎం హామీలిస్తారని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. నియోజకవర్గానికే తలమానికమైన రామాయపట్నం పోర్టు అభివృద్ధి విషయంపై మాట మాత్రం కూడా ప్రస్తావించలేదు. కందుకూరులో పట్టణ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఉత్తర బైపాస్ నిర్మాణ ప్రతిపాదనలు ఉన్నాయి. రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు అందాల్సిన 1.5 టీఎంసీల దామాషా నీరు చేరడానికి సోమశిల ఉత్తర కాలువను వెడల్పు పనులు పూర్తి కాలేదు. వెలిగొండ ప్రాజెక్ట్ నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు నీటిని తెచ్చే ప్రక్రియ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఎన్నికల ముందు కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇవి కాకుండా స్థానిక ఎమ్మెల్యే ఇంటూరు ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చారు. ఆయా పెండింగ్ ప్రాజెక్ట్‌లను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చంద్రబాబు నుంచి ప్రజలకు హామీ దక్కుతుందని భావించారు. అయితే ఏ ఒక్కదానిపై కూడా చంద్రబాబు ప్రస్తావించలేదు. నిధులిస్తామని హామీ ఇవ్వలేదు. కేవలం మున్సిపాలిటీలో వివిధ పనుల నిమిత్తం రూ.50 కోట్లు ఇస్తామంటూ ప్రకటనతో సరిపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదనలు చేస్తుంటే.. పట్టించుకోకుండా చంద్రబాబు నీకు ఎక్కువ సమయం ఇవ్వడం లేదు ముగించాలంటూ వారించారు.

స్థానికుల డిమాండ్‌పై ఎదురుదాడి

వేదిక ముందు కూర్చొన్న కొంత మంది కార్యకర్తలు కందుకూరును ప్రకాశంలో కలిపే విషయంపై ఏమి చేశారంటూ గట్టిగా కేకలు వేశారు. దీంతో చంద్రబాబు ఆ విషయం నాకు గుర్తుంది. ఎప్పుడు ఏం చేయాలో సమయానుకూలంగా చేస్తామంటూ చెప్పారు. దీనిపై సంతృప్తి చెందని ఓ కార్యకర్త ఎప్పుడు మారుస్తారో చెప్పాలంటే మరోసారి ప్రశ్నించారు. దీంతో వారిపై చంద్రబాబు ఎదురు దాడి చేశారు. 'నువ్వు చాలా తెలివైన వాడిలా ఉన్నావు.. అందరూ నీలాగా ఉంటే చాలా ఇబ్బందులు వస్తాయి. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనపై చాలా ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పుడు కందుకూరు హామీ ఇస్తే మిగిలిన వాళ్లు అందరూ కూడా అడుగుతారు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఓ నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది, అందరికి ఆమోదయోగ్యంగా ఉంటుందని' అంటూ చంద్రబాబు ముక్తాయింపు ఇచ్చారు.

మాట మార్చిన బాబు

గత ఎన్నికల ప్రచారం సందర్భంగా కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సైతం గెలిసిన ఆరు నెలల్లోనే ప్రకాశం జిల్లాలో కలుపుతామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కందుకూరు పర్యటనలో చంద్రబాబు ఈ విషయాన్ని దాటవేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. తిరిగి ప్రకాశంలో కలవడం ఇప్పట్లో జరిగే పని కాదని ఆ పార్టీ శ్రేణులే ఒక అభిప్రాయానికి వచ్చాయి. ఎమ్మెల్యే ప్రతిపాదనలను పట్టించుకోకుండా తనదైన శైలిలో చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగం చేయడంపై కూడా రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైంది.

ఎమ్మెల్సీ శ్రీకాంత్ డుమ్మా

కందుకూరు స్థానికుడైన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శనివారం చంద్రబాబు పర్యటనకు డుమ్మా కొట్టారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో పార్టీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ తన సొంత నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటనకు రాకపోవడం వెనుక ఎమ్మెల్యే ఇంటూరితో ఉన్న రాజకీయ విభేదాలే కారణమని తెలుస్తోంది.

ఆక్వా జోన్‌లో కలిపితే రాయితీలు
చిట్టమూరు: నాన్ ఆక్వా జోన్‌లోని భూములను జోన్ పరిధిలోకి తెస్తే.. పలు రకాల రాయితీలు వర్తించే వీలుంటుందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు సూచించారు. చిట్టమూరు, మల్లాం సచివాలయాల్లో శనివారం ఆక్వా సాగుదారులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా 134 హెక్టార్లలో ఆక్వా సాగు చేసే భూములను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆక్వా సాగుదారులు సుముఖత వ్యక్తం చేస్తే సిఫారసు చేస్తామన్నారు. మండలంలోని మల్లాం, చిట్టమూరు, పాదర్తివారికండ్రిక, రంగనాథపురం, పోతువాయినపాళెం, కొక్కుపాళెం, ముక్కుటిపాళెం, రాయిపెద్దిపాళెం గ్రామాల్లో ఆక్వా సాగు చేసే భూములను జోన్ పరిధిలోకి తీసుకొస్తామన్నారు. మత్స్యశాఖ అసిస్టెంట్ వెంకటరమణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అందరూ రహదారి నిబంధనలు పాటించాలి
- ముగిసిన రహదారి భద్రత మాసోత్సవాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ

నెల్లూరు (టౌన్): ప్రతి వాహనాదారుడు తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించాలని ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓవర్ స్పీడ్, మద్యం తాగి వాహనం నడపడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగం తదితర వాటిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రమాదాల్లో ఒకరు చేసిన తప్పు వల్ల మరొకరు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పొందాలన్నారు. ఈ సమావేశంలో ఎంవీఐలు ఎండీ రఫీ, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, మల్లికార్జున్‌రెడ్డి, ఆటో, లారీ యూనియన్ నాయకులు, డ్రైవింగ్ స్కూల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యమిత్రలపై కూటమి కత్తి

- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే యత్నం
- ఉద్యోగభద్రతపై ఆందోళన



ఆరోగ్య సేవలకు సహకరిస్తున్న వైద్యమిత్ర

సీతారామపురం: ఆరోగ్యశ్రీ పథకాన్ని (ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్) రోగులకు అందించడంలో కీలక భూమి పోషించే వైద్యమిత్రలకు భరోసా కరువైంది. ఆరోగ్యశ్రీని బీమా కంపెనీకి అప్పగిస్తారన్న ప్రకటన వైద్యమిత్రులను ఆవేదనకు గురి చేస్తోంది. 17 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న వారిని నేడు ఆధారం కోల్పోతామేమోనన్న భయం వెంటాడుతోంది.

120 మంది

జిల్లాలోని 132 పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, డిస్ట్రిక్, జీజీహెచ్ నెట్వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సేవలు కొనసాగుతున్నాయి. వాటిలో 35 ప్రైవేట్, 31 డెంటల్ (ప్రైవేట్), 66 ప్రభుత్వాస్పత్రులున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం నిర్వహణకు ఎనిమిది మంది టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్ ఒకరు, డీఎల్ ఒకరు, జిల్లా మేనేజర్ ఒకరుండగా 120 మంది వైద్యమిత్రలు పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ.15 వేల జీతాన్ని నిర్ధారించగా కటింగ్‌లు పోను రూ.13 వేలు చేతికందుతుంది. వైద్యమిత్రులంతా ఉన్నత చదువు లు చదివిన వారే. ఎప్పటికైనా తమకు గుర్తింపు, కనీస వేతనం అందుతుందని, ఉద్యోగభద్రత ఉంటుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో జీతాలివ్వడం ప్రారంభించినప్పటి నుంచి వారి కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా పరిగణిస్తున్న పరిస్థితి నెలకొంది.

ప్రధాన భూమిక

నెట్వర్క్ ఆస్పత్రుల్లో నెలకు రెండు వేలకు పైబడి శస్త్రచికిత్సలు జరుగుతున్నట్టు అంచనా. రోగులు హాస్పిటల్లో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికెళ్లే వరకు నిరంతరం వైద్యమిత్రలు పర్యవేక్షిస్తుంటారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండటంతో వైద్యమిత్రలంతా ఆందోళన చెందుతున్నారు. తమను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంచుతారా? లేక ప్రైవేట్‌కు అప్పగిస్తారా? అనే మీమాంస వారిని వెంటాడుతోంది. ప్రైవేట్‌కు అప్పగిస్తే ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సర్వీస్ మొత్తం ఎందుకు పనికిరాకుండా పోతుందనే ఆవేదనలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. దీనికితోడు ఉద్యోగాలు కొనసాగిస్తారా? లేక కొత్తవారిని తీసుకుంటారా అనే భయంలో ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పథకంలో 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వైద్య మిత్రులు, టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మేనేజర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి. న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నాం. ఎన్నికల హామీలో భాగంగా సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భరోసా కల్పించాలి.

– గడ్డం శ్రీనివాసులు, వైద్యమిత్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం చొరవ చూపాలి



వైద్యమిత్రలపై ప్రభుత్వం చొరవ చూపాలి. వేతనాల పెంపు, ఉద్యోగభద్రత తదితర సమస్యలను పరిష్కరించాలి. కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా కోసం ఎదురు చూస్తున్నాం.

– శ్రీకాంత్, వైద్యమిత్ర

క్లుప్తంగా

అంతర్జాతీయ పోటీలకు కావలి విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులు

కావలి: కావలి రూరల్ మండలం కొత్తసత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వి.షాలిని, వై.జ్యోతిలు అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొన్నారు. షాలిని రెండో స్థానంలో, జ్యోతి మూడో స్థానంలో నిలిచారు. దీంతో వారు శ్రీలంకలో జరుగనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థినులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, పీడీ మురళి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 148 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌కు శనివారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 148 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,874 మందికి 2,803 మంది హాజరయ్యారు. 71 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,148 మందికి 2,071 మంది హాజరయ్యారు. 77 మంది గైర్హాజరయ్యారు.

కండలేరులో 53.270 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 53.270 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లో లెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ ట్రాలీ తిరగబడి మహిళ మృతి

- ఇద్దరికి గాయాలు


కుమారి మృతదేహం

లింగసముద్రం: వారంతా కూలీలు. అప్పటి వరకు పొగాకు పొలంలో పనిచేశారు. తర్వాత ట్రాక్టర్‌లో వెళ్తుండగా ట్రాలీ తిరగబడింది. దీంతో ఓ మహిళా కూలీ మృతిచెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆర్ఆర్ పాలెం గ్రామం వద్ద శనివారం జరిగింది. ఎస్సై మహమ్మద్ సుభానీ కథనం మేరకు.. మొగిలిచర్ల పంచాయతీలోని నారసింహాపురం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పొగాకు ఆకులు రెలిపేందుకు మొగిలిచర్ల గ్రామానికి చెందిన 22 మంది కూలీలు ట్రాక్టర్‌లో వెళ్లారు. పని పూర్తయ్యాక ఇంటికి బయలుదేరారు. పెంట్రాల నుంచి మొగిలిచర్లకు వెళ్లే రోడ్డుకు సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ బండరాయిని ఎక్కడంతో తిరగబడింది. దీంతో ట్రాలీలో ఉన్న పోతినేని కుమారి (50), మరికొందరిపై పచ్చాకు పడిపోయింది. తోటి కూలీలు వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కుమారి ఊపిరాడక మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం కుమారి మృతదేహాన్ని కందుకూరుకు తరలించారు. ఈ ఘటనపై కుమారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్

రాపూరు: విజయనగరం జిల్లా గడివిడిలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగిన 12వ రాష్ట్ర స్థాయి అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో రాపూరు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. వారిని శనివారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ బాలుర విభాగం, బాలికల డిస్కస్ త్రోలో ప్రథమ స్థానం సాధించారన్నారు. బాలుర కబడ్డీ, బాలికల క్యారమ్స్, బాలికల షాట్‌పుట్, బాలుర డిస్కస్‌త్రో, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు వివరించారు. విద్యార్థులు బహుమతులు సాధించేందుకు కృషి చేసిన వ్యాయామ అధ్యాపకుడు పెంచలయ్యను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విశాలి, శివ, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ట

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్ధలయ్యకోన ఆవరణలో నూతనంగా నిర్మించిన సాయినాథుని మందిరంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. దాతలు ఆదూరు గిరిబాబు, అరుణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

మమ్మీ.. డాడీ.. త్వరగా వచ్చేయండి

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- సాఫ్ట్‌వేర్ దంపతులు దుర్మరణం
- తల్లడిల్లిన ఒక్కగానొక్క కుమారుడు


ఘటనా స్థలంలో భార్యాభర్తల మృతదేహాలు

పెళ్లకూరు: విధి ఎంత విచిత్రమైనదో ఈ ఘటన చూస్తే అర్థమవుతోంది. సరిగ్గా గంట ముందు కుమారుడితో ముచ్చటించిన ఆ దంపతులు ఆ తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో విగతజీవులుగా మారిపోయారు. శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. 71వ నంబర్ జాతీయ రహదారి మార్గం దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద ఆగి ఉన్న లారీని తిరుమల నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గాను మాధవకృష్ణ (48), పొక్కల సరిత సుమంగళి (43) అనే సాఫ్ట్‌వేర్ దంపతులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసుల కథనం.. హైదరాబాద్‌లోని ఆంజనేయనగర్ ప్రాంతానికి చెందిన మాధవకృష్ణ, సరిత సుమంగళి అదే పట్టణంలోని ఓ ప్రయివేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. దైవదర్శనం కోసం దంపతులిద్దరూ మూడురోజుల క్రితం కారులో బయలుదేరి శుక్రవారం అరుణాచలం గిరిప్రదక్షణ చేశారు. అదే రోజు రాత్రి తిరుమలకు వెళ్లి శనివారం తెల్లవారుజామున స్వామిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. దారిలో దొడ్లవారిమిట్ట గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి అతి వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లింది. సాఫ్ట్‌వేర్ దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కారును స్థానికుల సహాయంతో అతి కష్టం మీద బయటకు తీశారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను వెలికి తీశారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కన్నీళ్లు తెప్పించిన కుమారుడి మాటలు

తిరుమలలో శనివారం స్వామివారిని దర్శించుకున్న మాధవకృష్ణ, సరిత సుమంగళి దంపతులకు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కుమారుడు నిషాంత్ ఫోన్ చేసి మాట్లాడాడు. మమ్మీ.. డాడీ.. త్వరగా ఇంటికి వచ్చేయమని చెప్పాడు. యాక్సిడెంట్ తర్వాత పోలీసులు అతడికి ఫోన్ చేయగా ఇందాకే వారితో మాట్లాడానని బోరున విలపించాడు. దంపతులకు ఒకే ఒక కుమారుడైన నిషాంత్ 9వ తరగతి చదువుతున్నాడు. ఎక్కడికి వెళ్లాలన్నా ముగ్గురూ కలిసే వెళ్లేవారు. అయితే దూర ప్రయాణం కావడం, ప్రస్తుతం పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో నిషాంత్‌ను ఇంటి వద్ద వదిలిపెట్టి, భార్యాభర్తలిద్దరూ దైవదర్శనానికి బయలుదేరినట్టు తెలుస్తోంది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	105
లేయర్ (లైవ్)	80
బ్రాయిలర్ చికెన్	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	216
లేయర్ చికెన్	136

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.40
సన్నవి	రూ.25
పండ్లు	రూ.18



శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ


స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మి నరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిలకు శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు.